సాక్షి

పశ్చిమగోదావరి

శుక్రవారం । 25 । ఏప్రిల్ । 2025



'షార్ట్‌కట్' డేంజర్

ద్వారకాతిరుమల క్షేత్రంలో కొందరు భక్తులు ప్రమాదకర ప్రయాణాలు సాగిస్తున్నారు. కొండపైకి షార్ట్‌కట్ మార్గంలో వెళుతున్నారు.


8లో ▸



నర్సింగ్ కాలేజీలో వసూళ్లు!

ఏలూరు జీజీహెచ్ భవనంలో నిర్వహిస్తున్న జీఎన్ఎం నర్సింగ్ కాలేజీ వసూళ్ల పర్వానికి తెరలేపినట్లు తెలుస్తోంది.

8లో ▸



మామిడికాయ రెడీ

తణుకు మార్కెట్‌లో ఆవకాయ పచ్చడి కోసం మామిడికాయలు సందడి చేస్తున్నాయి. పలు రకాలు అందుబాటులో ఉన్నాయి.

8లో ▸

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా

మార్చి 25 : భీమవరం జువ్వలపాలెం రోడ్డు సమీపంలోని విసిప్ స్టే లాడ్జిలో తనిఖీలు చేస్తున్న సందర్భంలో రూమ్.401లో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1,01,600, 6 సెల్‌ఫోన్లు, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

ఏప్రిల్ 21 : భీమవరంలోని శ్రీనిధి రెసిడెన్సీలో టూటౌన్ పోలీసులు చేసిన సోదాల్లో విస్తుపోయే వాస్తవాలు వెలుగుచూశాయి. లాడ్జి రూముల్లో తొమ్మిది జంటలు పట్టుబడ్డాయి. ఐడెంటిటీ కార్డులు, పుస్తకాలను పోలీసులు పరిశీలించిన అనంతరం వారంతా వివిధ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులుగా గుర్తించారు. విద్యార్థులపై కేసులు పెడితే వారి భవిష్యత్తు నాశనం అవుతుందన్న ఉద్దేశంతో పోలీసులు స్టేషన్‌కు తీసుకువెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులను పిలిపించి వారికి అప్పగించారు.

యువత పెడతోవ

- భీమవరంలోని లాడ్జిల్లో పేకాట, బెట్టింగ్, వ్యభిచార కార్యకలాపాలు
- పట్టణంలో 35 వరకు లాడ్జీలు, హోటళ్లు
- గుట్టుగా సాగుతున్న అసాంఘిక కార్యకలాపాలు
- విద్యార్థులే లక్ష్యంగా నిర్వాహకుల గేలం
- గంటల లెక్కన అద్దె వసూళ్లు



భీమవరంలోని ఓ లాడ్జిలో పేకాడుతున్న వారిని పట్టుకున్న పోలీసులు (ఫైల్)

సాక్షి, భీమవరం: జిల్లా కేంద్రమైన భీమవరం విద్య, వైద్యం, ఆక్వా హబ్‌గా పేరొందింది. వ్యాపార లావాదేవీలు, ఇతర పనుల నిమిత్తం దూర ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం పట్టణంలో వన్‌టౌన్, టూటౌన్ పరిధిలో 35 వరకు హోటళ్లు, లాడ్జీలు ఉన్నాయి. వీటిలోని పలు లాడ్జీలు పేకాట, క్రికెట్ బెట్టింగ్, వ్యభిచారం తదితర అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. అడపాదడపా పోలీసుల తనిఖీల్లో ఒకటి అరా సంఘటనలు వెలుగుచూస్తుండగా గుట్టుగా సాగిపోతున్న వ్యవహారాలు ఎన్నో. ప్రస్తుతం ఐపీఎల్ సీజన్ నడుస్తుండటంతో భీమవరం, పరిసరాలకు చెందిన బుకీలు పట్టణంలోని లాడ్జీలు కేంద్రంగానే బెట్టింగ్ కార్యకలాపాలు సాగిస్తున్నట్టు తెలుస్తోంది. మారుమూల ప్రాంతాల్లోని పలు లాడ్జీలు పేకాటకు కేరాఫ్‌గా మారాయని సమాచారం.

అదనంగా వసూలు చేస్తూ.. సాధారణంగా ఎవరైనా లాడ్జిలోని రూం తీసుకునే సమయంలో వారి ఆధార్ కార్డు, సెల్‌ఫోన్ నంబర్, ఎన్ని రోజులు ఉంటారు? తదితర వివరాలను లాడ్జి నిర్వాహకులు రిజిస్టర్‌లో నమోదు చేయాలి. ఇతర ప్రాంతాలకు చెందిన వారైతే ఏ పని నిమిత్తం వారు పట్టణానికి వచ్చారు? ఎన్ని రోజులు ఉంటారనే వివరాలను కూడా రిజిస్టర్‌లో నమోదుచేయాలి. ప్రతిరోజూ ఆ వివరాలను పోలీస్‌స్టేషన్‌లో అందజేయాలి. కాగా చాలాచోట్ల ఇవేమీ అమలుకావడం లేదు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారు ముందుగానే లాడ్జి నిర్వాహకులు, సిబ్బందితో మాట్లాడుకోవడం ద్వారా వ్యక్తిగత వివరాలేమి ఇవ్వకుండానే రూముల్లో దిగి తమ పని కానిస్తున్నారు. సాధారణంగా రూమ్ అద్దెలతో పోలిస్తే వీరి నుంచి నిర్వాహకులు రెండు మూడింతలు ఎక్కువగా వసూలు చేస్తూ వారికి సహకరిస్తున్నారు. కొంతమంది పోలీసు సిబ్బందికి నెలవారీగా మామూళ్లు ముట్టచెప్పుతూ ఎప్పుడైనా పోలీసులు తనిఖీలకు వచ్చే సమయంలో వారి ద్వారా ముందుగానే సమాచారం తెలుసుకుని జాగ్రత్త పడుతున్నట్టు తెలుస్తోంది.

విద్యార్థులకు గేలం

విద్యాపరంగా పట్టణం పేరొందింది. దూర ప్రాంతాల నుంచి వేలాది మంది విద్యార్థులు ఇక్కడకు వచ్చి విద్యాభ్యాసం సాగిస్తున్నారు. ప్రేమ కార్యకలాపాలు సాగించేందుకు ఏకాంతం కోరుకునే యువ జంటలు లాడ్జిలను ఆశ్రయిస్తున్నారు. ఫలానా లాడ్జి అయితే సేఫ్ అని, స్టూడెంట్స్‌కు గంటల లెక్కన మాత్రమే అమౌంట్ తీసుకుంటారని లోపాయికారీగా పబ్లిసిటీ చేయించుకోవడం ద్వారా కొన్ని లాడ్జీలు యువతకు గేలం వేస్తున్నాయి. రెండు రోజుల క్రితం ఒక లాడ్జిలో పోలీసులు సోదాలు చేయగా తొమ్మిది జంటలు దొరకగా అందరూ విద్యార్థులే కావడం గమనార్హం. లాడ్జి నిర్వాహకులపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. పోలీసులు తరచూ తనిఖీలు చేయడం ద్వారా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

విస్తృతంగా తనిఖీలు



పట్టణంలోని హోటళ్లు, లాడ్జీలపై నిఘా ఉంచి ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాం. లాడ్జీల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఆయా వ్యక్తులతోపాటు లాడ్జి యాజమాన్యాలపై కూడా కేసులు నమోదు చేస్తాం. ఇప్పటికే లాడ్జీల్లో రూమ్‌లు తీసుకుంటున్న వారి వివరాలు ఆధార్ కార్డుతో సహా నమోదు చేసి ప్రతిరోజూ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించాలని ఆదేశాలు జారీ చేశాం.

– జి.కాళీచరణ్, టూటౌన్ సీఐ, భీమవరం



పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన యువత (ఫైల్)

పారిశుద్ధ్యంపై శ్రద్ధ తప్పనిసరి



మున్సిపల్ కమిషనర్లకు సూచిస్తున్న జేసీ

భీమవరం (ప్రకాశంచౌక్): పారిశుద్ధ్యం, పింక్ టాయిలెట్స్, ప్లాస్టిక్ నిర్మూలన, చలి వేంద్రాల ఏర్పాటుపై జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లతో గురువారం కలెక్టరేట్‌తో సమీక్షించారు. జిల్లాలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్లాస్టిక్ వినియోగించే షాపులపై ఆకస్మిక తనిఖీలు చేసి వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. వేసవి దృష్ట్యా రద్దీ ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దాతలు సహకారంతో పార్కులు అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆహార తినుబండారాలు, హోటళ్లపై తనిఖీలు చేసి నాణ్యత లోపాలుంటే కేసులు నమోదు చేయాలన్నారు. పీఎం సూర్యఘర్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు రామచంద్రారెడ్డి (భీమవరం), ఎం.ఏసుబాబు (తాడేపల్లిగూడెం), టి.రామకుమార్ (తణుకు), బి.విజయ సారధి (పాలకొల్లు), ఎం.అంజయ్య (నరసాపురం), జి. కృష్ణమోహన్ (ఆకివీడు), కలెక్టరేట్ డీటీ ఎం.సన్యాసిరావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతలకు పదవులు

యలమంచిలి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పాలకొల్లు నియోజకవర్గానికి చెందిన పలువురిని వివిధ హోదాల్లో నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ప్రకటన విడుదల చేసింది. జిల్లా ఉపాధ్యక్షుడిగా జగడ ఉమామహేశ్వరరావు, జనరల్ సెక్రటరీగా ఖండవల్లి వాసు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా మైలాబత్తుల మైఖేల్ రాజు, ఓదూరి భాస్కరరావు, సెక్రటరీలుగా కడలి ఏడుకొండలు, సంకరపు శ్రీను, అధికార ప్రతినిధిగా మామిడి వెంకటేశ్వరరావు నియమితులయ్యారు.

న్యూస్‌రీల్

శ్రీవారి సేవలో..



వేద ఆశీర్వచనం పొందుతున్న ఎమ్మెల్సీ కవురు, మాజీ ఎమ్మెల్యే ముదునూరి

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, నరసాపురం మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు గురువారం సందర్శించారు. ఆలయంలో విశేష పూజలు చేయించారు. పండితులు వారికి శేషవస్త్రాలను కప్పి వేద ఆశీర్వచనాన్ని పలికారు. వైఎస్సార్ సీపీ నాయకులు బొండాడ వెంకన్నబాబు, అన్సారి, సతీష్ ఉన్నారు.

'సాక్షి'పై దాడి దారుణం

ఏలూరు (టూటౌన్): ఏలూరులోని సాక్షి మీడియా కార్యాలయంపై జరిగిన దాడిని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) ఏలూరు జిల్లాశాఖ ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. సంఘటనపై పోలీస్ శాఖ విచారణ జరిపి నిజానిజాలను వెలికితీయాలని, దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది. పత్రికా స్వేచ్ఛను హరిస్తూ అధికార తెలుగుదేశం పార్టీ నాయకులు ఇలా మీడియాను చెప్పుచేతల్లో పెట్టుకోవాలని చూడటం మానుకోవాలని కోరింది. జిల్లా అధ్యక్షుడు ఎండీ జబీర్, కార్యదర్శి వైవీ హరీష్, రాష్ట్ర కార్యదర్శి కేఎస్ శంకరరావు, రాష్ట్ర కార్య వర్గ సభ్యుడు టి.శ్రీనివాసరావు, సీనియర్ నాయకుడు కె.బాలసౌరి, కమిటీ సభ్యులు ఖండించిన వారిలో ఉన్నారు.

సెక్షన్ 30 అమలు

భీమవరం: భీమవరం పోలీసు సబ్‌డివిజన్ ప్రాంతంలో సెక్షన్ 30 వచ్చేనెల 23 వరకు అమలులో ఉంటుందని భీమవరం డీఎస్పీ రావూరి గణేష్ జయసూర్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. భీమవరం, వీరవాసరం, ఆకివీడు, ఉండి, కాళ్ల మండలాల పరిధిలో సభలు, బహిరంగ సమావేశాలు, ధర్నాలను అనుమతి లేకుండా నిర్వహించరాదని స్పష్టం చేశారు. అలాగే అనుమతి లేకుండా మైకులు, సౌండ్‌బాక్సులు ఉపయోగించకూడదని డీఎస్పీ పేర్కొన్నారు.

నీటి తీరువా బకాయిలపై దృష్టి

నరసాపురం: నీటి తీరువా బకాయిల వసూళ్లపై దృష్టి పెట్టాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నరసాపురం డివిజన్‌లోని తహసీల్దార్లు, వీఆర్వోలతో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక దరఖాస్తులు, రెవెన్యూ అంశాలపై సమీక్షించారు. నీటి తీరువా వసూళ్లతో పాటుగా ధాన్యం కొనుగోళ్ల అంశంలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. గోనె సంచుల కొరత ఉండరాదన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు జరగాలన్నారు. పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో జాప్యం తగదన్నారు. ఆర్డీఓ దాసి రాజు, తహసీల్దార్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఉగ్ర దాడులు అమానవీయం



నౌషాద్ మోహిద్దీన్

తాడేపల్లిగూడెం (టీఓసీ): జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు అమాయకుల ప్రాణాలు తీయడం ఖండించదగ్గ విషయమని, వారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపం చెబుతున్నట్టు వైఎస్సార్‌సీపీ జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్కే నౌషాద్ మోహిద్దీన్ తెలిపారు. ప్రపంచంలోని అన్ని మతాలు అహింస విధానం బోధిస్తాయని, హింసని వీడాలని బోధిస్తూ ఉంటాయన్నారు. ఇతరుల ప్రాణాలను తీయడాన్ని ఏ ధర్మం అనుమతించదని, ఇలాంటి ఉగ్రవాదులను పట్టుకుని ఉరి తీయాలని అన్నారు. భారతీయులంతా ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో శాంతియుతంగా మెలగాలని తెలిపారు.

ఉగ్రదాడి పిరికి పంద చర్య

ఆకివీడు: పహల్గాంలో ఉగ్రదాడి పిరికి పంద చర్య అని డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణంరాజు అన్నారు. స్థానికంగా గురువారం దాడికి నిరసనగా కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. దేశ భద్రత, సమైక్యత కోసం ప్రజలంతా ఐక్యంగా నిలవాలన్నారు. దాడిలో మృతి చెందిన వారికి ప్రగాఢ సంతాపం తెలిపారు. కలెక్టర్ సీహెచ్ నాగరాణి, సీఐ జగదీశ్వరరావు, ఎస్సై హనుమంతు నాగరాజు, నటుడు రావు రమేష్ పాల్గొన్నారు.

విదేశాల్లో ఉద్యోగాలకు శిక్షణ

ఏలూరు (టూటౌన్): బీఎస్సీ నర్సింగ్ జీఎన్ఎం పూర్తిచేసిన యువతకు విదేశాల్లో ఉద్యోగాల కల్పనలో భాగంగా 8 నెలల పాటు జర్మనీ భాషపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు ప్రకటనలో తెలిపారు. శిక్షణలో భాగంగా ఉచిత వసతి, భోజనం కల్పిస్తారన్నారు. బీ–2 లెవిల్ పరీక్ష ద్వారా జర్మనీలో ఉద్యోగాలు కల్పిస్తారని ఆసక్తిగల వారు ఈనెల 26న గుంటూరులో నందు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



భీమవరంలో జరిగిన ఆశా వర్కర్ల ఆవిర్భావ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోపీమూర్తి

భీమవరం: పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని, ఆశా కార్యకర్తల ఐక్యంగా పోరాడాలని ఎమ్మెల్సీ బి.గోపీమూర్తి పిలుపునిచ్చారు. గురువారం ఆశా వర్కర్స్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా భీమవరం త్యాగరాజ భవనంలో చింతపల్లి లక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆశా కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సర్వీసును క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తలకు కనీస సౌకర్యాలు లేవని, ప్రభుత్వం యాప్‌తో పనిభారం పెంచిందని విమర్శించారు. ఆశా కార్యకర్తలకు గ్రాట్యూటీ, కనీస వేతనాలు లేవని పీఎఫ్, ఈఎస్ఐ ఊసెత్తకుండా ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయించుకుంటోందని గోపీమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్‌వీ గోపాలన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తేస్తున్న లేబర్ కోడ్స్ చట్టాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో ఆశా కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా నాయకులు బి. వాసుదేవరావు, డి.కల్యాణి, ఎ.అజయ్ కుమారి, యూనియన్ జిల్లా కార్యదర్శి డి.జ్యోతి, ఎల్ఎస్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలతో సీహెచ్ఓల సతమతం

- ఉద్యోగ భద్రత కరువు
- మూడు నెలలుగా ఇన్సెంటివ్ బకాయిలు
- నిరవధిక సమ్మెకు సన్నద్ధం



వృద్ధులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న సీహెచ్ఓ

పెంటపాడు: నేషనల్ హెల్త్‌మిషన్ (ఎన్‌హెచ్ఎం) ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో సేవలందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సీహెచ్ఓ)లు సమస్యలతో సతమతమవుతున్నారు. గ్రామీణ స్థాయిలో సేవలందిస్తున్న వీరు ఉద్యోగ భద్రత లేక, సకాలంలో జీతాలు అందక, సరైన గుర్తింపు లేక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు 368 సీహెచ్ఓలు పనిచేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 14 రకాల ఆరోగ్య సేవలను వీరు అందిస్తున్నారు. మలేరియా, డెంగీ నివారణకు కృషి చేయడంతో పాటు గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఆరోగ్య జాగ్రత్తలు వివరిస్తున్నారు. అలాగే ప్రభుత్వం ద్వారా ఆరోగ్య సర్వే, ఫ్యామిలీ హెల్త్ సేవలు, ఇంటింటికీ సేవలు అందిస్తున్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం వీరంతా జిల్లాకేంద్రాల్లో నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో నిరవధిక సమ్మెకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. ప్రధానంగా వీరికి మూడు నెలలుగా ఇన్సెంటివ్‌లను ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది.

సీహెచ్ఓల డిమాండ్లు

- ఆరేళ్లు పూర్తయిన సీహెచ్ఓల సర్వీసులను క్రమబద్ధీకరించాలి.
- ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా 23 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలి.
- ఏటా 5 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలి
- జీతాలతో పాటు ఇన్సెంటివ్‌లు అందించాలి.
- గ్రామాల్లో ప్రభుత్వ క్లినిక్‌ల అద్దెలను సకాలంలో చెల్లించాలి.

ధాన్యం కొనుగోలు వేగిరపర్చాలి



ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న జిల్లా మేనేజర్ శివరామప్రసాద్

పెంటపాడు: జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను అధికారులు వేగవంతం చేయాలని జిల్లా పౌరసరఫరాల మేనేజర్ టి.శివరామప్రసాద్ ఆదేశించారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. సేవా కేంద్రాల్లో ట్రక్‌షీట్, సంచుల వివరాలు, ట్రక్కుషీట్, ట్రాన్స్‌ఫర్ ఆర్డర్, రైతులు ఆరబోసిన ధాన్యం తేమశాత, మిల్లర్ల వద్ద మిల్లర్లు వద్ద పనితీరు పరిశీలించారు. మిల్లర్లకు ఇచ్చిన లక్ష్యాలకు అనుగుణంగా సంచులను రైతు సేవా కేంద్రాలకు అందజేయాలన్నారు. వచ్చిన ధాన్యాన్ని త్వరితగతిన దిగుమతి చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు రూ.479 కోట్ల విలువైన 2,07,721 టన్నుల ధాన్యాన్ని 21,920 మంది రైతుల వద్ద నుంచి సేకరించామన్నారు. ఏడీఏ పి.మురళీకృష్ణ, ఇన్‌చార్జి తహసీల్దార్ సీతారత్నం, ఏఓ సారథి, కో–ఆపరేటివ్ అధికారి రవికుమార్ ఆయన వెంట ఉన్నారు.

సినిమాల్లో ఇతర భాషల నటులే ఎక్కువ

సినీ నటుడు రావు రమేష్



భీమవరంలో సినీనటుడు రావు రమేష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

భీమవరం: తెలుగు సినీ రంగంలో నిర్మాతలు మినహా ఎక్కువ మంది ఇతర భాషల వారే ఉన్నారని సినీ నటుడు రావు రమేష్ అన్నారు. గురువారం రాత్రి భీమవరం డీఎన్నార్ కళాశాల గన్నాబత్తుల క్రీడా మైదానంలో చైతన్య భారతి సంగీత, నృత్య, నాటక పరిషత్ 18వ జాతీయస్థాయి సాంఘిక నాటికల పోటీలు ప్రారంభం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నాటి సినీ నటులు నాటక రంగం నుంచి వెళితే నేడు నాటక రంగంతో ఎలాంటి పరిచయం లేకున్నా ఇన్‌స్టాగ్రామ్, సోషల్ మీడియాలో స్క్రిప్ట్స్, రీల్స్ వంటివి చూసి నటులను ఎంపిక చేసుకునే రోజులు నడుస్తున్నాయన్నారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ నాటక రంగానికి ప్రభుత్వాలు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని, సినీ పరిశ్రమకు ఇస్తున్న రాయితీలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు కళారంగాన్ని ప్రత్యేకించి నాటక రంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. కలెక్టర్ సీహెచ్ నాగరాణి మాట్లాడుతూ డిజిటల్ రంగంలో ప్రజలు మునిగి తేలుతున్న సమయంలో కళాపరిషత్‌లు నాటక రంగాన్ని రక్షించడం గొప్ప విషయమని, నాటక రంగాన్ని బతికించాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. చైతన్య భారతి నాటక పరిషత్ అధ్యక్షుడు రాయప్రోలు భగవాన్ మాట్లాడుతూ నాలుగు రోజులపాటు 10 నాటికలు ప్రదర్శిస్తామన్నారు. ముందుగా సినీ నటుడు రావు రమేష్‌కు ఆత్మీయ చైతన్య పురస్కారం, రంగస్థల నటుడు, రచయిత ఎస్కే మిశ్రోకు చుక్కన సత్యనారాయణరాజు రంగస్థల చైతన్య పురస్కారం, రంగస్థల నటీమణి పి.మణిబాలకు పెనుబోతుల శేషగిరిరావు హార్దిక చైతన్య పురస్కారాలతో సత్కరించారు. అనంతరం ప్రదర్శించిన కళానికేతన్ కాట్రపాడు వారి కిడ్నాప్, మైత్రి కళానిలయం హైదరాబాద్ వారి బ్రహ్మ స్వరూపం నాటికలు ఆకట్టుకున్నాయి. డీఎన్నార్ కళాశాల అధ్యక్షుడు గోకరాజు వెంకట నర్సింహరాజు, చిలుకూరి నర్సింహరాజు, మంతెన రామ్‌కుమార్ రాజు, పీఆర్వో భట్టిప్రోలు శ్రీనివాసరావు, నడింపల్లి మహేష్‌కుమార్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ స్పీకర్ తీరు సరికాదు

పాలకోడేరు: ఉండి నియోజకవర్గంలో పేదల ఇళ్ల విధ్వంసానికి వ్యతిరేకంగా సీపీఎం చేస్తున్న పోరాటంపై డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు స్పందించిన తీరు దారుణమని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం గోపాలన్ విలేకరులతో మాట్లాడుతూ.. కాలువ గట్లపై ఉన్న పేదల వల్లే మంచినీరు కలుషితమవుతుందని ఆయన చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వం నిపుణుల కమిటీ వేసి పరిశీలిస్తే వాస్తవాలు వెల్లడవుతాయన్నారు. ఇళ్లు కట్టిస్తామని ప్రభుత్వం చెబుతుంటే రఘురామ కృష్ణంరాజు కూల్చే పనిలో బిజీగా ఉన్నారని ఎద్దేవా చేశారు. కూల్చిన ఇళ్లకు ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపించాలని, ఆ వివరాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇళ్లు కూల్చి బాధితులను ఎందుకు రోడ్డు మీద పడేశారు? కనీసం తాగునీరు, ఆహారం, నీడ కూడా కల్పించ లేదని, ఇదేనా మానవత్వం అని ప్రశ్నించారు. రఘురామకృష్ణరాజు డిప్యూటీ స్పీకర్ హోదాలో ఉంటూ సీపీఎం రాష్ట్ర కార్యదర్శిపై వాడిన భాష సభ్యసమాజం తలదించుకునేలా ఉందన్నారు. చంపుతామన్న బెదిరింపు ధోరణితో మాట్లాడం సిగ్గుచేటన్నారు. తిట్టినా, చంపినా కమ్యూనిస్టులు బెదిరిపోరని, పేదలకు న్యాయం జరిగే వరకూ పోరాడమని గోపాలన్ అన్నారు. పాలకోడేరులో బడా భూస్వాముల ఆధీనంలో అక్రమంగా ఉన్న ప్రభుత్వ భూములు, కొబ్బరి చెట్ల గురించి డిప్యూటీ స్పీకర్ మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. రఘురామకృష్ణరాజు వైఖరికి నిరసనగా శుక్రవారం జిల్లావ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలు తెలపాలని గోపాలన్ పిలుపునిచ్చారు.

'సాక్షి'పై దాడి అమానుషం

వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ ఇన్‌చార్జి సునీల్



ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా సాక్షి కార్యాలయంపై దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఆయన అనుచరులు దాడి చేయటం, కొందరు గుర్తుతెలియని వ్యక్తులు కార్యాలయంలో కంప్యూటర్లు ధ్వంసం చేయటం సరికాదని వైఎస్సార్ సీపీ ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జి కారుమూరి సునీల్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ... మనం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నాం, మంచి చేయండి, ప్రజలకు చేరువ కావటానికి ప్రయత్నం చేయండి, పత్రికా స్వేచ్ఛను ఒక ప్రజా ప్రతినిధి స్థాయిలో ఉంటూ బెదిరింపులు, అనుచరులతో దాడులు చేయటం ఏమాత్రం సమర్థనీయం కాదు అని అన్నారు. అధికారం శాశ్వతం కాదని, అధికారం తమకు వస్తే ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలని అన్నారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని, మీకు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వంలో పథకాలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ప్రజలకు ఏం చేశారో చెప్పాలని నిలదీశారు. దౌర్జన్యాలు, అరాచకాలు, లిక్కర్ మాఫియా, కోడిపందాలు, జూదాలు తప్ప ఏమున్నాయని సునీల్ ప్రశ్నించారు.

సూర్య ప్రతాపం



ఎండ తీవ్రతకు గురువారం ఏలూరు నగరంలో జనసంచారం తగ్గిపోయి రోడ్లన్నీ కర్ఫ్యూను తలపించాయి. మధ్యాహ్నం 12 గంటల తర్వాత పెద్దగా జనసంచారం కనిపించ లేదు. నిత్యం రద్దీగా ఉండే ఫైర్‌స్టేషన్ సెంటర్ ఇలా దర్శనమిచ్చింది. – సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు

క్లుప్తంగా

26న జిల్లా ఓపెన్ చెస్ టోర్నమెంట్



సీపీఐ జిల్లా కార్యాలయంలో చెస్ టోర్నమెంట్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్) : ఈనెల 26న ఏలూరు సీపీఐ జిల్లా కార్యాలయం, స్ఫూర్తి భవన్ నందు జిల్లా ఓపెన్ చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు, జిల్లా నాయకుడు పి కిషోర్ తెలిపారు. సీపీఐ జిల్లా కార్యాలయం నందు చెస్ టోర్నమెంట్ బ్రోచర్‌ను గురువారం వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీపీఐ ఏర్పడి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, ఏఐటీయూసీ క్రీడా సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని చెస్ క్రీడాకారులంతా ఈ పోటీల్లో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏలూరు సహాయ కార్యదర్శి కూరెళ్ళ వరప్రసాద్, ఏఐటీయూసీ ఏలూరు ఏరియా కార్యదర్శి ఎస్ అప్పలరాజు, నాయకులు బి జగన్నాధరావు తదితరులు పాల్గొన్నారు.

మే 4 నుంచి శంకరమఠంలో వేద పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): శ్రీ గోదావరీ మండల వేదశాస్త్ర ప్రవర్ధకసభా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉభయ గోదావరి జిల్లా వేద విద్యార్థులకు మే 4, 5, 6 తేదీల్లో తాడేపల్లిగూడెంలోని శంకరమఠంలో వేద పరీక్షలు నిర్వహించనున్నట్లు శంకరమఠం సభ్యులు వెల్లడించారు. సుమారు 450 మంది వేద విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలు వేద, శాస్త్ర, శ్రౌత, స్మార్త, ఆగమ, అపర్ణ విద్యలో జరుగుతాయన్నారు. విద్యార్థులందరికీ 3 రోజులు భోజన వసతులు పట్టణంలో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. మే 6 వ తేదీన శంకర మఠంలో పాలకొల్లు వలివేటి శ్రీ హరి శర్మ సన్మానం, వేద సభ జరగనున్నట్లు పేర్కొన్నారు.

చోరీ కేసులో ముద్దాయిలకు జైలు శిక్ష

నరసాపురం: పట్టణంలో జరిగిన ఓ దొంగతనం కేసులో నేరం రుజువు కాడడంతో ముద్దాయిలు కొత్తపల్లి రమేష్‌కు రెండేళ్ల సాధారణ జైలు, రూ 2వేలు జరిమానా, బీర రమేష్, గుబ్బల భాస్కర్‌కు ఏడాది సాధారణ జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ నరసాపురం జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనివాస్ తీర్పు చెప్పారు. నరసాపురం టౌన్ సీఐ బి.యాదగిరి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని జోస్యులవారి వీధి కొప్పర్తి వెంకటరత్నం ఇంట్లో జరిగిన దొంగతనం ఘటనలో ముద్దాయిలను 2023 జనవరి 16వ తేదీన అప్పటి ఎస్సై సుధాకరరెడ్డి కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. కోర్టు విచారణలో నేరం రుజువు కావడంతో ముద్దాయిలకు కోర్టు జైలు శిక్ష విధించినట్టు సీఐ వివరించారు.

పచ్చళ్లకు మామిడికాయ రెడీ

- రోజుకు 15 టన్నుల మామిడికాయలు తణుకు మార్కెట్‌కు
- ఇంకా ఊపందుకోని అమ్మకాలు
- అమావాస్య దాటాక అమ్మకాలపై ఆశలు



తణుకు సంత మార్కెట్‌లో మామిడికాయల అమ్మకాల సందడి



ఆవకాయకి మామిడికాయ ముక్కలు కొడుతున్న దృశ్యం

తణుకు అర్బన్ : వేసవి వచ్చిందంటే చాలు ప్రతి ఇంట్లో ఆవకాయ తదితర పచ్చళ్ల పట్టే సందడి నెలకొంటుంది. ఇదే నేపథ్యంలో తణుకు సంత మార్కెట్‌లో ఆవకాయ పచ్చడి కోసం మామిడికాయలు సందడి చేస్తున్నాయి. గత 10 రోజులుగా తెల్లవారుజాము నుంచే వివిధ రకాల జాతులకు చెందిన మామిడి కాయలు తణుకు మార్కెట్‌లోకి అందుబాటులోకి వస్తున్నాయి. మామిడికాయలు రంగు, రూపుతోపాటు దిగుబడులు కూడా అధికంగానే ఉన్నప్పటికీ కొనుగోళ్లు మాత్రం ఇంకా ఊపందుకోలేదు. అనుకున్న మేర అమ్మకాలు లేకపోవడంతో వ్యాపారులు అమ్మకాల కోసం పడిగాపులు పడాల్సి వస్తుంది. కాపు ఎక్కువగా ఉండడంతో ధరలు కూడా అందుబాటులో ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు. అయితే ప్రజల్లో ఆవకాయ, మాగాయి తదితర పచ్చళ్ల పట్టే ఆసక్తి తగ్గిందని, రెడీమేడ్ పచ్చళ్లకు కొన్ని రకాల ప్రజానీకం అలవాటుపడ్డారని, దానికితోడు జనం దగ్గర డబ్బులు కూడా లేకపోవడంతో ఈ ఏడాది మామిడికాయల కొనుగోళ్లు ఆశాజనకంగా లేవని తెలుస్తోంది.

15 టన్నుల మామిడి కాయలు దిగుమతి

తూర్పుగోదావరి జిల్లా నుంచి అధికంగా తణుకు మార్కెట్‌లోకి రకరకాల జాతులకు చెందిన మామిడికాయలు రోజుకు సుమారుగా 15 టన్నుల వరకు అందుబాటులోకి వస్తున్నాయి. సంత మార్కెట్‌ను ఆనుకుని జరుగుతున్న మామిడికాయల అమ్మకాలకు సంబంధించి రాజమండ్రి, తుని, కత్తిపూడి, అన్నవరం తదితర ప్రాంతాల నుంచి కొత్తపల్లి కొబ్బరి, ఐజర్లు, పెద్ద రసాలు, చిన్న రసాలు, సువర్ణరేఖ, దేశవాళి వంటి రకాల మామిడికాయలు నిత్యం తణుకు మార్కెట్‌లో అమ్మకాలకు సిద్ధంగా ఉన్నాయి. గతంలో మాదిరిగా అమ్మకాలు లేకుండా పోయాయని ఈ అమావాస్య గడిస్తే కొంతమేర పచ్చళ్ల పట్టే పరిస్థితులు పెరుగుతాయేమోనంటూ వ్యాపారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మార్కెట్‌లో కొత్తపల్లి కొబ్బరి, ఐజర్ల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. పచ్చడి కోసం ఎక్కువగా వినియోగదారులు ఈ కాయల కోసం మక్కువ చూపుతున్నారని వ్యాపారులు స్పష్టం చేస్తున్నారు.



మామిడి కాయ నాణ్యతను బట్టి ధరలు ఇలా...

కొత్తపల్లి కొబ్బరి కాయ	రూ. 25
ఐజర్లు	రూ. 25
చిన్నరసాలు	రూ. 20
పెద్ద రసాలు	రూ. 20
సువర్ణరేఖ	రూ. 20
దేశవాళి	రూ. 15

ముక్కలు కొట్టేందుకు పోటాపోటీ

మామిడికాయలు కొనుగోలు చేసుకుని మార్కెట్‌లోనే ఆవకాయ పచ్చడికి కావాల్సిన సైజులో ముక్కలు కొట్టే కార్మికులు కూడా పోటీపడుతున్నారు. ఎవరు మామిడి కాయలు కొంటారా అని వారి చుట్టూ తిరుగుతూ ముక్కలు కొట్టేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. ప్రతి దుకాణం వద్ద ఒకరు ముక్కలు కొడుతూ ఉపాధి పొందుతున్నారు. కాయ సైజును బట్టి రూ. 2 నుంచి రూ.3 తీసుకుంటున్నారు.

ఇంకా ఊపందుకోని అమ్మకాలు



ఈ వేసవి సీజన్‌లో మామిడి కాయ దిగుబడి అధికంగానే ఉన్నపటికీ ప్రస్తుతానికి పచ్చడి కోసం మామడి అమ్మకాలు ఇంకా ఊపందుకోలేదు. గతంలో పచ్చడి మామిడికాయలు ఎప్పుడు వస్తాయా అనే విధంగా ఎదురుచూసేవారు. కానీ నేడు ధరలు అందుబాటులోనే ఉన్నా వ్యాపారాలు పూర్తిస్థాయిలో జరగడంలేదు. ఆదివారం అమావాస్య అనంతరం అమ్మకాలు పెరుగుతాయని అనుకుంటున్నాము. రెడీమేడ్ పచ్చళ్లతోపాటు జనం దగ్గర డబ్బులు లేకపోవడం కూడా అమ్మకాల తగ్గడానికి కారణం అయివుండవచ్చు.

– కొతారు రామాంజనేయులు, మామిడికాయల వ్యాపారి, తణుకు

పనిచేస్తూ ఉపాధి కూలీ మృతి



నాగమణి (ఫైల్)

నిడమర్రు: ఉపాధి హామీ పథకం పనుల్లో పనిచేస్తూ ఉపాధి కూలి కొరపాటి నాగమణి (48) మృతి చెందిన ఘటన గురువారం పెదనింద్రకొలను గ్రామంలో చోటుచేసుకుంది. తోటి కూలీల కథనం ప్రకారం నాగమణి పత్తేపురం– పెదనింద్రకొలను గ్రామాల మధ్య ఉన్న మురుగు కాలువలో తూడు, గుర్రపుడెక్క తొలగించే పనులకు వెళ్లింది. మరి కొద్ది సేపట్లో పనులు ముగుస్తాయనగా కాలువలో తూడూ, గుర్రపు డెక్క తొలగిస్తూ ఒకేసారి కుప్పకూలి కాలువలో పడిపోయింది. తోటి కూలీలు గమనించి కాలువ గట్టుపైకి తీసుకువచ్చారు. అనంతరం నాగమణిని పెదనింద్రకొలను పీహెచ్‌సీకి తీసుకువెళ్లగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలికి భర్త మంగయ్య, ఇద్దరు పెళ్లైన కుమార్తెలు ఉన్నారు. నిడమర్రు ఎస్సై వీరప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం నాగమణి మృతదేహాన్ని తాడేపల్లిగుడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విలేకరిపై గుర్తుతెలియని వ్యక్తుల దాడి

ఏలూరు టౌన్: ఓ చానల్ విలేకరిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. వివరాల ప్రకారం ఏలూరు టూటౌన్ గిలకలగేటు ప్రాంతానికి చెందిన ఉల్లింగల చంద్రకాంత్ అలియాస్ చందు ఏలూరులో ఒక చానల్ విలేకరిగా పనిచేస్తున్నాడు. ఈ నెల 23తేదీ అర్ధరాత్రి అతనిపై గుర్తు తెలియని వ్యక్తులు దారికాచి మరీ ఇనుపరాడ్లతో దాడి చేశారు. మోటారు సైకిల్‌పై ఇంటికి వెళుతున్న సమయంలో ఆకస్మికంగా దుండగులు దాడి చేయగా చేతులు అడ్డుపెట్టుకోవటంతో చందుకి చేతివేళ్లు విరిగాయి. ఆ సమయంలో అతను కేకలు వేయడం, స్థానికులు రావడంతో దుండగులు పారిపోయారు. కుటుంబ సభ్యులు చందును ఏలూరు జీజీహెచ్‌కు తరలించగా వైద్యులు చికిత్స అందించారు. ఈ ఘటనపై ఏలూరు టూటౌన్ సీఐ కే.అశోక్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రేకులు మీద పడి వ్యక్తి మృతి

ఆగిరిపల్లి: మందులు కొనుగోలు చేసేందుకు వెళ్లిన వ్యక్తిపై ప్రమాదవశాత్తూ రేకులు పడడంతో మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. తోటపల్లికి చెందిన పామర్తి హనుమంతరావు (60) ఆగిరిపల్లిలోని మందుల దుకాణంలో మందులు కొనుగోలు చేసి వెళ్తుండగా అతడి తలపై దుకాణం పైన ఉన్న రేకులు పడిపోవడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు అతడిని విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. హనుమంతరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్సై శుభశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి కొండపై షార్ట్‌కట్ మార్గం వద్దు

- అభివృద్ధి పనులు జరుగుతున్న ప్రాంతంలో నుంచి భక్తుల రాకపోకలు
- షార్ట్‌కట్ మార్గాలు వినియోగించవద్దంటున్న అధికారులు



కొండపైన రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతంలో నుంచి రాకపోకలు సాగిస్తున్న భక్తులు

ద్వారకాతిరుమల : శ్రీవారి క్షేత్రంలో కొందరు భక్తులు ప్రమాదకర ప్రయాణాలు సాగిస్తున్నారు. కొండపైకి షార్ట్‌కట్ మార్గంలో వెళుతున్నామని అనుకుంటున్నారే గాని, ఏదైనా ప్రమాదం జరిగితే పరిస్థితి ఏమిటనేది ఆలోచించడం లేదు. వివరాల్లోకి వెళితే. ద్వారకాతిరుమల చినవెంకన్న కొండపైన రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. స్వామివారి దర్శనానంతరం కొందరు భక్తులు వైకుంఠం క్యూ కాంప్లెక్స్ సమీపంలోని మార్గం గుండా కొండపైన నిత్యాన్నదాన భవనం, శివాలయం వద్దకు కాలినడకన వెళుతున్నారు. అయితే అటుగా వెళ్లకూడదని ఆలయ అధికారులు ఆ మార్గంలో ఎన్ని అడ్డం పెట్టినా, వాటిని దాటుకుని మరీ భక్తులు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో జేసీబీతో పూడిక పనులు జరుగుతున్నాయి. భక్తులు షార్ట్‌కట్ మార్గాల్లో వెళ్లకుండా జంటగోపురాల వద్దకు చేరుకుని, అక్కడి నుంచి దేవస్థానం ఉచిత బస్సుల ద్వారా నిత్యాన్నదాన భవనం, శివాలయం, బస్టాండ్‌లకు చేరుకోవాలని ఆలయ అధికారులు సూచిస్తున్నారు. అభివృద్ధి పనులు జరుగుతున్న ప్రాంతాల వైపు వెళ్లొద్దని కోరుతున్నారు.

హత్యకు దారితీసిన సరిహద్దు తగాదా



కత్తుల పోలు మృతదేహాన్ని పరిశీలిస్తున్న నరసాపురం డీఎస్పీ శ్రీవేద, పాలకొల్లు రూరల్ సీఐ శ్రీనివాస్

యలమంచిలి : సరిహద్దు తగాదాల నేపథ్యంలో కొంతేరు కట్టా వారి పుంతకు చెందిన కత్తుల పోలు (58)ను అతని ఎదురింటిలో ఉండే బత్తుల ఏసుదాసు (పెద్దోడు), అతని భార్య భారతి కలసి హత్య చేశారు. మృతుడు పోలు భార్య జానకమ్మ పోలీసులకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోలు, ఏసుదాసు స్నేహితులు. కొంతకాలం క్రితం సరిహద్దు తగాదా రావడంతో శత్రువులయ్యారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి పోలు ఇంటి తలుపులు చప్పుడు కావడంతో జానకమ్మ తలుపు తీసింది. ఆమెను తోచుకుని లోపలకు వెళ్లి ఏసుదాసు, అతని భార్య భారతి పోలుపై దాడి చేసి కత్తితో నరికారు. పోలు మెడ, ఎడమ భుజం, కుడి చేతికి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మరణించాడు. ఈ మేరకు జానకమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. నరసాపురం డీఎస్పీ శ్రీవేద, పాలకొల్లు రూరల్ సీఐ గుత్తుల శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేశారు. పోలు మృతదేహానికి శవ పంచనామా, పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. నిందితులు పరారీలో ఉన్నారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

26, 27 తేదీల్లో బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

ఏలూరు రూరల్: మే 15వ తేదీ నుంచి 18 వరకూ చిత్తూరులో ఆంధ్రప్రదేశ్ 10వ అంతర జిల్లాల అండర్–14 సబ్ జూనియర్ బాలబాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె కృష్ణారెడ్డి, కార్యదర్శి గవ్వ శ్రీను ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాలుర జట్టు ఎంపిక పోటీలను ఈ నెల 26వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు తాడేపల్లిగూడెం కడగట్ల మునిసిపల్ హైస్కూల్ ఆవరణలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. బాలికల జట్టు ఎంపిక పోటీలను ఈ నెల 27వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు ఏలూరు కస్తూరిబా బాలికల పాఠశాల ఆవరణలో చేపడతామని పేర్కొన్నారు. 2012 జనవరి 1 తర్వాత పుట్టిన బాలబాలికలు మాత్రమే ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని వివరించారు. ఆసక్తి గలవారు ఒరిజినల్ ఆధార్, పుట్టినతేదీ పత్రాలతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 77804–84313, 94411–71933 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయాలి



విలేకరుల సమావేశంలో భారత రాజ్యాంగం, పంచాయతీరాజ్ చట్టం పుస్తకాలను చూపుతున్న సంతోష్‌కుమార్

ఏలూరు (టూటౌన్): పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయాలని ఎస్సీ సర్పంచ్‌లు హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ అన్నారు. పంచాయతీరాజ్ చట్టం అమల్లోకి వచ్చిన రోజును పురస్కరించుకుని స్థానిక ఎన్ఆర్‌పేటలోని ఎస్సీఆర్‌పీఎస్ అండ్ ఏఐఏవైఎస్ రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్య దేశంలో పంచాయతీరాజ్ వ్యవస్థ అత్యంత కీలకమైనదని, మేధావులతో కూడిన అనేక కమిటీలు దీన్ని ఏర్పరిచారన్నారు. కానీ పంచాయతీరాజ్ చట్టాలను అమలు చేయటంలో గ్రామ స్థాయి అధికారుల నుంచి రాష్ట్ర స్థాయి అధికారుల వరకు విఫలమయ్యారని చరిత్ర తెలియజేస్తుందన్నారు. పంచాయతీరాజ్ చట్టాన్ని గ్రామ, మండల, జిల్లా స్థాయిలో సర్పంచ్, మండల పరిషత్ అధ్యక్షులు, జిల్లా పరిషత్ చైర్మన్లు పాలనను వారిని చేయనియ్యకుండా ఎమ్మెల్యేలు హైజాక్ చేసి పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని సంతోష్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నూకపెయ్యి కార్తీక్ పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి రిమాండ్

ఏలూరు టౌన్: హత్యాయత్నం కేసులో నిందితుడికి కోర్టు రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. వన్‌టౌన్ సీఐ జీ.సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఏలూరు కత్తేపువీధికి చెందిన షేక్‌బాజీ గతంలో బావిశెట్టివారిపేటకు చెందిన యువతిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. అనంతరం ఇరువరి మధ్య వివాదం తలెత్తడంతో ఆమెను వదిలివేశాడు. అయితే అత్త జయలక్ష్మిపై బాజీ కక్ష పెంచుకున్నాడు. ఈనెల 22న రాత్రివేళ జయలక్ష్మిపై బిర్లాభవన్ సెంటర్ వద్ద షేక్‌బాజీ ఆకస్మికంగా వెనుకవైపు నుంచి దాడి చేశాడు. తీవ్ర గాయాలైన జయలక్ష్మిని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఏలూరు వన్‌టౌన్ పోలీసులు షేక్‌బాజీపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. అతడ్ని గురువారం సాయంత్రం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించింది.

నారాయణపురంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ

ఉంగుటూరు: ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణులైన విద్యార్థులకు నారాయణపురం శ్రీ అరవింద శతజయంతి ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టి కే విశ్వేశ్వరరావు తెలిపారు. ఈనెల 26వ తేదీలోగా విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 81251 55788 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నర్సింగ్ కాలేజీలో వసూళ్ల పర్వం!

- పేద విద్యార్థినులను వేధిస్తున్న కాలేజీ యాజమాన్యం
- అడ్మిషన్ల నుంచి క్యాపింగ్ వరకూ భారీగా వసూళ్లు?
- ఏలూరు జీజీహెచ్‌లో జీఎన్ఎం నర్సింగ్ కాలేజీ దుస్థితి



ఏలూరు సర్వజన ఆసుపత్రి (ఫైల్)

ఏలూరు టౌన్: ఏలూరు జీజీహెచ్ భవనంలో నిర్వహిస్తున్న జీఎన్ఎం నర్సింగ్ కాలేజీ వసూళ్ల పర్వానికి తెరలేపినట్లు తెలుస్తోంది. అడ్మిషన్ల నుంచి క్యాపింగ్ సెర్మనీ వరకు విద్యార్థినుల నుంచి సొమ్ములు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. డబ్బులు చెల్లించాలంటూ నర్సింగ్ విద్యార్థినులపై కాలేజీ యాజమాన్యం వత్తిడి చేస్తూ వేధింపులకు గురిచేస్తుండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పేదవర్గాల పిల్లలకు వృత్తివిద్యా కోర్సులు అందించేందుకు ప్రభుత్వం జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ (జీఎన్ఎం) మూడున్నర సంవత్సరాల డిప్లమో కోర్సును అందిస్తోంది. ఏలూరు సర్వజన ఆసుపత్రిలో భవనంలోనే ఒక విభాగంలో జీఎన్ఎం నర్సింగ్ కాలేజీ ఏర్పాటు చేశారు. ప్రతి ఏడాది ప్రభుత్వం కౌన్సిలింగ్ ద్వారా అడ్మిషన్లు అందిస్తూ పూర్తి ఉచితంగా జీఎన్ఎం కోర్సును పేద వర్గాల విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారు. మూడున్నరేళ్ల కోర్సుకు సంబంధించి ఒక్కో ఏడాది 60 మందికి అడ్మిషన్లు ఇస్తూ ఉంటారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల పేద వర్గాల పిల్లలకు ఉచితంగా నర్సింగ్ కోర్సును అందిస్తూ వారి కాళ్లపై వారు నిలబడి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగు పర్చుకోవటమే ప్రభుత్వ లక్ష్యం. కానీ ఏలూరు జీజీహెచ్‌లోని జీఎన్ఎం కోర్సు చదివే విద్యార్థినులతో యాజమాన్యం దారుణంగా ఆటలాడుతూ భారీగా వసూళ్లు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

భారీగా వసూళ్లు?

ఏలూరు సర్వజన ఆసుపత్రి భవనంలోని జీఎన్ఎం నర్సింగ్ కాలేజీలో రెండు రోజుల్లో క్యాపింగ్ సెర్మనీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సుమారు 240 మంది విద్యార్థినులకు వారి విద్య పూర్తిచేసి ఉత్తీర్ణత సాధించిన నేపథ్యంలో క్యాపింగ్ సెర్మనీ నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో ఒక్కో విద్యార్థిని నుంచి రూ.2 వేలు వసూలు చేసేలా యాజమాన్యం టార్గెట్ పెట్టినట్లు తెలుస్తోంది. ఇలా జీఎన్ఎం నర్సింగ్ విద్యార్థినిల నుంచి రూ.4.80 లక్షల సొమ్ములు వసూలు చేసేలా నిర్ణయించారు. కాలేజీ యాజమాన్యం పేరు చెప్పకుండా కాలేజీలోని సీనియర్ విద్యార్థినిలకు బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. నర్సింగ్ కాలేజీలోని అధికారులకు బంగారు ఆభరణాలు చేయించాలనీ, ఇతరత్రా ఖర్చులు ఉంటాయనీ, కచ్చితంగా డబ్బులు కట్టాలంటూ వత్తిడి చేస్తున్నారనీ, తమకు తినటానికే డబ్బులు లేకుంటే ఇక రెండు వేలు ఎక్కడి నుంచి తెస్తామంటూ విద్యార్థినుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

డబ్బులు ఇవ్వకుంటే.. వేధింపులే

జీఎన్ఎం కోర్సు పూర్తి చేయాలంటే తమ కనుసన్నల్లోనే ఉండాలనీ, తాము తలచుకుంటే మీరు పాస్ కూడా కారంటూ కాలేజీ యాజమాన్యం నిత్యం విద్యార్థినిలను బ్లాక్‌మెయిల్ చేస్తూ ఉంటారని చెబుతున్నారు. క్యాపింగ్ సెర్మనీకి రూ.2వేలు చెల్లించకుంటే మీకు సర్టిఫికెట్లు చేతికి రాకుండా ఎలా చేయాలో తమకు తెలుసంటూ బెదిరింపులకు పాల్పడుతున్నట్లు చెబుతున్నారు. వృత్తివిద్యా కోర్సు కావటంతో విద్యార్థినులు సైతం మౌనంగా వేధింపులు భరిస్తూ ఉంటున్నారని పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉగ్రదాడులను వ్యతిరేకిస్తూ శాంతి ర్యాలీ



సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): పహల్గాం ఉగ్రదాడిని వ్యతిరేకిస్తూ సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం శాంతి ర్యాలీ నిర్వహించారు. కోట దిబ్బ సీతారాం భర్తీయా కళ్యాణ మండపం నుంచి మార్కెట్ మీదుగా ఈ ర్యాలీ సాగింది. ఈ ర్యాలీని ఉద్దేశించి సీఐటీయూ ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు, ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిఘా వైఫల్యం వల్లే ఈ దారుణం జరిగిందన్నారు. గత పదేళ్లుగా సైన్యంలో సైతం రిక్రూట్మెంట్ లేకుండా చేసి దేశ భద్రతనే ఫణంగా పెట్టారని విమర్శించారు. దేశ ఐక్యతను కాపాడుకోకుండా మతం పేరుతో చిచ్చుపెడుతూ ఉగ్రవాదాన్ని నిర్మూలించాలంటే అది మోసపూరితమైన చర్యేనని అన్నారు. ఇప్పటికైనా దేశ సమైక్యతను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వీవీఎన్ ప్రసాద్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే శ్రీనివాస్, నాయకులు కే రామాంజనేయులు, ఎం.ఇస్సాకు, కే.పోచమ్మ, కమల తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యోగాతో మానసిక ఉల్లాసం



అలంపురంలో విజ్ఞాన్ స్కూల్‌లో యోగా తరతుల ముగింపు దృశ్యం

పెంటపాడు: యోగాతోనే మానసిక ఉల్లాసం సాధ్యమని పలువురు వక్తలు తెలిపారు. మండలంలోని అలంపురం విజ్ఞాన్ స్కూల్లో గత వారం రోజులగా జరుగుతున్న యోగా తరగతులు గురువారం ముగిసాయి. ఈ సందర్భంగా గూడెం పతంజలి యోగా ఆచార్యులు విం జమూరి మాదవరావు గురూజీ, స్కూల్ డైరెక్టర్ గుణ్ణం చిరంజీవిల ఆధ్వర్యంలో జరిగిన ఈ యోగా క్లాసులకు 300 మంది విద్యార్థులు పాల్గొని యోగాసనాలు నేర్చుకొన్నారు. యోగా వల్ల ఉపయోగాలు గురూజీ వివరించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొమ్ముగూడెంలో చల్లాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ



కొమ్ముగూడెంలో ప్రతిష్ఠించిన చల్లాలమ్మ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో చల్లాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం రాత్రి అమ్మవారి గ్రామోత్సవం జరిగింది. వీరంపాలెం శ్రీబాలాత్రిపుర సుందరీ పీఠం వ్యవస్థాపకులు గరిమెళ్ల వెంకటరమణ శాస్త్రి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పాతూరు 33/11 కేవీ సబ్ స్టేషన్ పాతూరు పరిధిలోని మహాలక్ష్మీనగర్, జెడ్పీహెచ్ ఫీడర్లుకు మరమ్మతుల నిమిత్తం ఈ నెల 25వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ కె.నరసింహమూర్తి వెల్లడించారు. ఈ సందర్భంగా మెయిన్‌రోడ్డు, మసీద్ రోడ్డు, కింబర్లీ స్కూల్, పంపు హౌస్, మహాలక్ష్మీనగర్, సత్యవతినగర్, చెట్లు రోడ్డులలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పంచాయతీ సుస్థిర అభివృద్ధిపై దృష్టి సారించాలి



పెదతాడేపల్లి గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ అన్నవరం

తాడేపల్లిగూడెం రూరల్: పంచాయతీ సుస్థిర అభివృద్ధిపై పంచాయతీ సిబ్బంది దృష్టి సారించాలని పెదతాడేపల్లి సర్పంచ్ పోతుల అన్నవరం అన్నారు. గురువారం మండలంలోని పెదతాడేపల్లి రైతు సేవా కేంద్రం వద్ద పంచాయతీ రాజ్ దినోత్సవ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అన్నవరం మాట్లాడుతూ పంచాయతీ రాజ్ చట్టాలు, విధి, విధానాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. తద్వారా గ్రామాల సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ



తణుకులో చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేస్తున్న మానవత సభ్యులు

తణుకు అర్బన్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేశారు. స్థానిక గమిని ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో దాత చిట్టూరి సుజాత సౌజన్యంతో రూ. 15వేలు విలువైన గొడుగులను వ్యాపారులకు అందజేసినట్లు మానవత శాంతి ర్యాలీ కమిటీ చైర్మన్ గమిని రాంబాబు తెలిపారు. మానవత ఆధ్వర్యంలో ఎన్నో సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ముఖ్యంగా పట్టణానికి చెందిన చిట్టూరి సుజాత దాతృత్వంలో ఎంతో మందికి సంస్థ తరపున సాయం అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో మానవత విస్తరణ, అభివృద్ధి కమిటీ స్టేట్ కన్వీనర్ డాక్టర్ కోడూరి రాధా పుష్పవతి, జిల్లా కన్వీనర్లు బోయపాటి రామలక్ష్మి, ఎస్వీ సతీషబాబు, వీవీ రామకృష్ణ, కోశాధికారి అక్కిన కాశీవిశ్వనాథం, ఆనందం మస్తానరావు తదితరులు పాల్గొన్నారు.

పదిలో సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

- 587 మార్కులతో తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్ విద్యార్థిని కావ్యశ్రీ టాప్
- ఊతమిచ్చిన గత ప్రభుత్వ విధానాలు, పథకాలు
- ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు



కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతులమీదుగా మెమెంటో అందుకున్న విద్యార్థిని పడాల కావ్యశ్రీ



అత్తిలి మండల టాపర్‌గా నిలిచిన అత్తిలి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని షారోన్ బ్లెస్సీని అభినందిస్తున్న హెచ్‌ఎం విజయలక్ష్మి



ఇరగవరం మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థిని గుణ గౌరీ దానేశ్వరీదేవి

తణుకు అర్బన్: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మంచి మార్కులతో సత్తా చాటారు. ప్రైవేటుకు దీటుగా మార్కులు సాధించి శభాష్ అనిపించుకున్నారు. విద్యార్థుల ప్రతిభతో పాటు ఉపాధ్యాయుల కృషితో తల్లిదండ్రుల కలలు నిజం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడంతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో...

తణుకు నియోజకవర్గంలోని తణుకు మునిసిపాలిటీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాలకు సంబంధించి 28 పాఠశాలల్లో 1661 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 1237 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇందులో తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థిని పడాల కావ్యశ్రీ అత్యధికంగా 587 మార్కులు సాధించి నియోజకవర్గంలో టాపర్‌గాను జిల్లాలో నాలుగవ స్థానంలో నిలిచింది.

- తణుకు మునిసిపాలిటీ, తణుకు మండలానికి సంబంధించి మొత్తం 11 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 821 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 84 శాతంతో 533 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వీరిలో పడాల కావ్యశ్రీ 587, జాస్తి సీతామహాలక్ష్మి జిలా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని పి.నమిత 573, ఏకేటీపీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలి విద్యార్థిని కొల్లి సౌజన్య 565 మార్కులు, దువ్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిన్ది రెవిరి మోహన వెంకట అమృత 565 మార్కులతో మొదటి నుంచి మూడో స్థానాల్లో నిలిచారు.
- అత్తిలి మండలానికి సంబంధించి 10 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 424 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 89 శాతంతో 378 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మండలంలో అత్తిలి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని పి.షారోన్ బ్లెస్సీ 582, ఆరవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి కె.సత్యనారాయణరెడ్డి 581, అత్తిలి గవర్నమెంట్ హైస్కూలు విద్యార్థి పి.రవివర్మ 580 మార్కులతో మొదటి నుంచి మూడు స్థానాల్లో నిలిచారు.
- ఇరగవరం మండలానికి సంబంధించి 7 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 416 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 82 శాతంతో 326 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మండలంలో కె.ఇల్లింద్రపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని గుణ గౌరీ దానేశ్వరీ దేవి 574, రేలంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ముప్పిడి గాయత్రి 564, కాకిలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని జె.లక్ష్మీ ప్రశాంతి 562 మార్కులు సాధించి మొదటి నుంచి మూడు స్థానాల్లో నిలిచారు.

నాటి వసరులే నేటి ఫలితాలు..

రాష్ట్ర వ్యాప్తంగా విద్యావ్యవస్థను ప్రక్షాళనే చేసే విధంగా గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చారు. ముఖ్యంగా నాడు-నేడు ద్వారా పాఠశాలల్లో కార్పొరేటు పాఠశాలల్లో లేని వసతులను ఏర్పాటు చేశారు. పేద విద్యార్థులు విద్యకు ప్రాధాన్యతనిచ్చే విధంగా అమ్మ ఒడి, విద్యాకానుక, గోరుముద్ద వంటి పథకాలతో తల్లిదండ్రులు తమ పిల్లలను విద్యాభ్యాసం చేసేలా మార్పులు తీసుకువచ్చారు. పాఠశాలల్లో రక్షిత మంచినీరు ఆకర్షణగా టాయిలెట్స్, బెంచీలు, డెస్కులు వంటి సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య కూడా గణనీయంగాపెరుగుతోంది.

జిల్లా కలెక్టరు అభినందన...

పదో తరగతి పరీక్ష ఫలితాలకు సంబంధించి ప్రభుత్వ పాఠశాలల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను గురువారం భీమవరంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రత్యేకంగా అభినందించి మెమెంటోలు అందచేశారు. తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థిని పడాల కావ్యశ్రీకి కలెక్టర్ మెమెంటో అందజేశారు.

ఉపాధ్యాయుల కృషి ఎనలేనిది..

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు కార్పొరేటు పాఠశాలలకు దీటుగా మంచి మార్కులు సాధించారు. ఇందులో విద్యార్థుల ప్రతిభ ఎంత ఉందో అదే విధంగా ఉపాధ్యాయుల కృషి కూడా ఉంది. ప్రత్యేక కార్యాచరణతో విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధపెట్టి మంచి ఫలితాలు వచ్చేందుకు ఉపాధ్యాయులు కృషిచేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించారు.

డి.మురళి సత్యనారాయణ, డీవైఈవో, తణుకు డివిజన్

ఐఏఎస్ నా లక్ష్యం..



తణుకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించి ఈ ఏడాది పరీక్షా ఫలితాల్లో 587 మార్కులు సాధించడం చాలా సంతోషంగా ఉంది. నా తల్లి తండ్రుల కష్టం, ఉపాధ్యాయుల కృషితో పట్టుదలగా చదివాను. మొదటి నుంచి మా పాఠశాలలో అన్ని విభాగాల్లోను ఉపాధ్యాయులు నాపై చాలా శ్రద్ధ పెట్టి నన్ను ప్రోత్సహించారు. ట్రిబుల్ ఐటీలో సీటు దక్కించుకుని, భవిష్యత్తులో ఐఏఎస్ ఆఫీసర్ అవ్వాలనేది నా లక్ష్యం.

– పడాల కావ్యశ్రీ, తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థిని

విద్యార్థులకు అభినందనలు



పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఆర్సీడీఎస్ ప్రతినిధులు

పెంటపాడు: మండలంలో పదో తరగతి విద్యార్థులకు రెడ్డి కమ్యూనిటీ డవలప్మెంట్ సొసైటీ (ఆర్సీడీఎస్) ఆధ్వర్యంలో గురువారం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ముదునూరుపాడు మాగంటి అన్నపూర్ణాదేవి ఓరియంటల్ బాలికోన్నత హైస్కూల్లో జరిగిన ఈ కార్యక్రమానికి సంఘ జిల్లా గౌరవ అధ్యక్షుడు నల్లమల్లి విజయానందరెడ్డి, జిల్లా అధ్యక్షుడు చిర్ల సత్యనారాయణరెడ్డిలు పాల్గొని విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ద్వారంపూడి వపన్ కుమార్‌రెడ్డి, నల్లమిల్లి జగన్‌మోహన్‌రెడ్డి, సత్తి శ్రీనివాసరెడ్డి, కర్రి మురళీకృష్ణారెడ్డి, శివారెడ్డి, పృధ్వీకుమార్‌రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు పోతంశెట్టి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల సమావేశం

- అధికారుల ప్రసంగాలకే పరిమితం
- చర్చకు రాని ప్రజా సమస్యలు
- ఎమ్మెల్యే చెప్పిన వారికే పనులు



సమావేశంలో మాట్లాతున్న ఎంపీపీ

ఇరగవరం: ఇరగవరం మండల ప్రజాపరిషత్తు సర్వసభ్య సమావేశం గురువారం ప్రసంగాలకే పరిమితమైంది. మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశం ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగతాయరు అధ్యక్షత నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయా శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన పథకాలు, పనులు తదితర వివరాలను వెల్లడించారు. ప్రజా సమస్యల గురించి చర్చించలేదు. దీంతో సమావేశం వాడివేడిగా జరిగింది. 15వ ఆర్థిక సంఘం నిధులు ఎంపీటీసీలకు చెప్పకుండా వాళ్ల అనుమతి లేకుండా ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సూచించిన వారికి అధికారులు ఇవ్వడం, అదే సమయంలో వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు గ్రామాల్లో అభివృద్ధి కొరకు నిధులు అడుగుతుంటే వెళ్లి ఎమ్మెల్యేని కలవాలని అధికారులు చెబుతున్నారని ఎంపీటీసీలు ఆరోపించారు. ఇరగవరం ఎంపీటీసీ మంగిన రామానాయుడు మాట్లాడుతూ 15 ఆర్థిక సంఘం నిధులు 86 లక్షలు బర్రెలు గ్రౌండ్లకు పెట్టడం జరిగింది. 19 లక్షలు వాటర్ వర్క్సికి ఇచ్చిన మీరు ఎంపీటీసీకి ఒక మాట కూడా చెప్పలేదు. అలాంటప్పుడు ఎంపీటీసీ వ్యవస్థ ఎందుకు అని అధికారులను నిలదీశారు. ఎంపీడీఓ శ్రీనివాస్ సమాధానం ఇస్తూ 15 ఆర్థిక సంఘాల నిధులను ఆయా గ్రామాల్లో స్మశాన వాటిక అభివృద్ధి వాటర్ వర్క్స్ కొరకు అత్యవసరంగా పెట్టడం జరిగింది. అదే సమయంలో ఏ ఒక్క ఎంపీటీసీ కూడా మాకు ప్రత్యేకంగా నిధులు కావాలని అడగలేదని తెలిపారు. అనంతరం కొంతసేపు రివ్యూ సమావేశం జరిగింది. ఎంపీపీ అలివేలు మంగతాయారు మరికొంత మంది ఎంపీటీసీలు సమావేశం నుంచి బయటికి వచ్చేశారు. మిగిలిన వారితో సమావేశాన్ని అధికారులు ముగించారు. కో ఆప్షన్ సభ్యులు ఎస్కే బాబు మాట్లాడుతూ కె.ఇలిందలపర్రు, తూర్పు విప్పర్రు గ్రామాల్లో కోట్ల రూపాయిలతో వేసిన రోడ్లుకు ఇరువైపులా బెరములు నాణ్యమైన సోట్రూతో వేయకపోవడం, మొన్న కురిసిన వర్షాలకు ఇరువైపుల బేరములు పోయాయని వాటిని వెంటనే వీళ్లని ఆర్అండ్‌బి అధికారులు సరిచేయాలని నిలదీశార. జాతీయ పంచాయితీ రాజ్ దినోత్సవం సందర్భంగా పంచాయితీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పదిలో ప్రతిభ చాటిన గురుకుల విద్యార్థులు





పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్.అంబేద్కర్ గురుకుల విద్యార్థులు వై.అవినాష్ (574), ఎస్.రాఘువ (572)

తాడేపల్లిగూడెం రూరల్: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలోని పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్.అంబేద్కర్ గురుకుల విద్యార్థులు సత్తా చాటారు. పాఠశాల నుంచి మొత్తం 76మందికి గాను 73మంది పాసైనట్లు ప్రిన్సిపల్ బి.రాజారావు గురువారం తెలిపారు. 73మందిలో 500లకు పైగా మార్కులను 27మంది, 550మార్కులకు పైగా ఎనిమిది మంది సాధించినట్లు వివరించారు. వై.అవినాష్ 574 మార్కులు సాధించి స్కూలు టాపర్‌గా నిలిచాడన్నారు. ఎస్.రాఘువ 572, కే.రంజిత్‌కుమార్ 560మార్కులతో ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించినట్లు వివరించారు. అలాగే, పి.జాయ్ సందీప్ 557, పి.నిఖిల్ బాబు 556, డి.సాత్విక్ 553, డి.రాజేష్ 552, బి.అఖిల్ బాబు 551 మార్కులు సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను జిల్లా విద్యాశాఖాధికారి నారాయణ, సమగ్ర శిక్ష ఏపీసీ శ్యామ్ సుందర్, గురుకుల విద్యాలయాల జిల్లా సమన్వయాధికారి బి.ఉమా కుమారి, ప్రిన్సిపల్ బి.రాజారావు, వైస్ ప్రిన్సిపల్ బి.ప్రతాప్, ఉపాధ్యాయులు ఎంవి.బాలాజీ, ఎస్.ఆనంద్, వి.బలరాం, తదితరులు అభినందించారు.

సమ్మర్ అలవెన్స్‌లు పునరుద్ధరించాలి



ఆరుళ్ల గ్రామంలో గ్రామీణ వికాస శ్రామికులతో మాట్లాడుతున్న కండెల్లి సోమరాజు

తాడేపల్లిగూడెం రూరల్: గ్రామీణ వికాస శ్రామికులకు సమ్మర్ అలవెన్స్‌లు పునరుద్దరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని ఆరుళ్ల గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రామికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో సమ్మర్ అలవెన్స్‌లు ఇచ్చేవారని, ప్రస్తుతం నిలిపేసారన్నారు. శ్రామికులకు రూ.600లు చెల్లించాలని, 200 రోజులు పనిదినాలు కల్పించాలని, మేట్లకు పారితోషికం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సుంకర సత్యవతి, నాగమణి, చదలవాడ సూరిబాబు, వారా భాస్కరరావు, కండెల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లిషుపై పట్టు సాధించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న రామకృష్ణంరాజు

భీమవరం: ఉన్నత విద్యనభ్యసించడానికి ఇంగ్లిష్ అవసరమని అందువలన ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించాలని భీమవరం డీఎన్నార్ కళాశాల జాయింట్ సెక్రటరీ కె రామకృష్ణంరాజు అన్నారు. గురువారం వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డీఎన్నార్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, గ్రామర్ ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు మాట్లాడుతూ మే 3వ తేదీ వరకు ప్రతి రోజూ శిక్షణ తరగతులు ఉంటాయని వీటిని భీమవరం పరిసర ప్రాంతాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మానవత అధ్యక్షుడు వెంకటపతిరాజు, కేవీఎస్ఎన్ రాజు, జాన్సీలక్ష్మి, కలిగొట్ల గోపాలశర్మ, సత్యమూర్తి, పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ఎన్ రాజు ఉన్నారు.

ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపాలి



అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): జమ్మూ కాశ్మీర్ పెహల్గాంలో ఉగ్రవాదులు దాడిని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానటరింగ్ సభ్యులు చీకటి మిల్లి మంగరాజు తీవ్రంగా ఖండించారు. పట్టణంలో గురువారం జరిగిన సమావేశంలో మంగరాజు మాట్లాడుతూ అమాయక పర్యాటకులపై కిరాతకమైన చర్య అన్నారు. దేశ సమైక్యతకు దెబ్బతీసే ఉగ్రవాద చర్యలను ఎట్టి పరిస్థితులలోను సహించకూడదన్నారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

వివేకానంద గ్లోబల్ స్కూలు వార్షికోత్సవం



తణుకు గ్లోబల్ స్కూలు వార్షికోత్సవంలో జ్యోతిప్రజ్వలన చేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: స్థానిక వివేకానంద గ్లోబల్ స్కూల్‌లో గురువారం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికలు, నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరుకాగా, ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల అధ్యక్షుడు కె.సుబ్బారావు, పాఠశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, సంయుక్త కార్యదర్శి చిట్టూరి వెంకట కృష్ణారావు, కార్యదర్శి చిట్టూరి రీనాసాయి, ప్రిన్సిపాల్ ఆర్.రవీంద్రనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని యువకుడి మృతి

తాడేపల్లిగూడెం అర్బన్ : పట్టణంలోని 6వ వార్డులో లోటస్ ఎస్టేట్ వద్ద గురువారం రాత్రి ఇసుక టిప్పర్‌ను ఢీకొన్న మోటారు సైకిల్ సంఘటన సంభవించింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం ..తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన అంబటి నవీన్‌బాబు, కరణం వెంకటేష్‌లు స్నేహితులు.గురువారం రాత్రి స్నేహితులిద్దరూ నిట్ వైపు నుంచి గాంధీబొమ్మ సెంటర్ వైపు మోటారు సైకిల్‌పై వస్తూ లోటస్ ఎస్టేట్ వద్ద ఇసుక టిప్పర్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఇరువురిని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యలో కరణం వెంకటేష్ (30) మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అంబటి నవీన్‌బాబుకు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందజేస్తున్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంచాయతీ రాజ్ వర్క్‌షాపునకు సర్పంచ్‌లు



అమరావతిలో జరిగిన శిక్షణ కార్యక్రమానికి హాజరైన అప్పారావుపేట సర్పంచ్, తదితరులు

తాడేపల్లిగూడెం రూరల్: పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా అమరావతిలో నిర్వహించిన వర్క్ షాపునకు తాడేపల్లిగూడెం మండలం అప్పారావుపేట గ్రామ సర్పంచ్ ఆరుగొల్లు శ్రీనివాస్, కొత్తూరు ఎమ్పీటీసీ ఉప్పు నరసింహమూర్తిలతో పాటు పెంటపాడు మండలం దర్శిపర్రు సర్పంచ్ కోలా శేషవేణి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ రాజ్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు.

వెంకట్రావుపాలెంలో చలివేంద్రం ప్రారంభం



వెంకట్రావుపాలెంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వెంకట్రావుపాలెం గ్రామంలో చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. మదర్ థెరిస్సా సోషల్‌సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈ చలివేంద్రం ఏర్పాటు చేశారు. తొలుత చలివేంద్రాన్ని అప్పారావుపేట జనసేన నాయకుడు గంధం ఏడుకొండలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో చలివేంద్రాల ఏర్పాటు అవసరమన్నారు. మదర్ థెరిస్సా సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు పెదముత్తి ప్రేమ్ కుమార్, అప్పారావుపేట జనసేన నాయకుడు పోసిన వెంకటేష్, వెంకట్రావు, సంసోను, నాయకులు మాదాసి సతీష్, మాదాసి సురేష్, నాగవరపు నాగు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఫైలేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలి



పెంటపాడు ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో ఫైలేరియా కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

పెంటపాడు: బోధకాలు వ్యాధికి కారణమయ్యే ఫైలేరియా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెంటపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి తోట రాజేష్ పేర్కొన్నారు. గురువారం గూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వీ. లక్ష్మణరావు ఆధ్వర్యంలో కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బోదకాలు వ్యాధిపై అవగాహన కల్పించారు. పలువురికి కిట్లు అందజేశారు. ఈకార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో సత్యనారాయణ, మారిశెట్టి తేజోనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్స్ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న బి.హరికుమార్

తాడేపల్లిగూడెం (టీఓసీ): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్న నేటికి పెన్షనర్స్ సమస్యలు ఏ ఒక్కటి పరిష్కరించలేదని ఏపీ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ యూనిట్ అధ్యక్షుడు బి.హరికుమార్ అన్నారు. విశ్రాంత భవనంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కనీసం తగ్గించిన అడిషనల్ కోంటమ్ పునర్దురణ జరగలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఆర్‌లను, పీఆర్‌సీలు వచ్చే లోగా 30 శాతం ఇంటిరీయమ్ రిలీఫ్ ప్రకటించి, చెల్లించాలని, హెల్త్ కార్డులపై నగదు రహిత వైద్య సదుపాయాలను అన్ని ఆసుపత్రులలో కలిగించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరారు. విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

6 నుంచి కాళ్లకూరు వెంకన్న కల్యాణ మహోత్సవాలు

కాళ్ల: కాళ్లకూరులలో వేంచేసియున్న శ్రీవేంకటేశ్వర స్వామి వార్షిక సప్తాహ్నిక తిరు కల్యాణ మహోత్సవాలు మే 6వ తేదీ నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈఓ ఎం.అరుణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం స్వామి వారి కల్యాణ మహోత్సవాలు గోడ పత్రికలను ఏపీ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురాకృష్ణరాజు ఆవిష్కరించారు. ఇప్పటికే ఆలయం వద్ద చలువ పందిళ్లు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.